# శిలువ

"మావాళ్లు ప్రేమతత్వం తెలుసుకోలేని మూర్ఖులు. మీరన్నా నన్నర్థం చేసుకోండి. నన్ను చనిపోనివ్వండి. ప్లీజ్. లేకపోతే నా ప్రేమ ఫలించేలా చూడండి"

ఎలాగైనా మృత్యువును అందుకోవాలని సతమతమవుతోంది పేషంటు వనజ. అయితే మృత్యువుతో పోరాడి ఆమెను రక్షించాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది డాక్టర్. చివరికి డాక్టర్ నైటిన్‌గేల్ విజయాన్ని సాధించింది.

వనజ వాదనను కాదనే శక్తి ఆమెకు లేదు. అంగీకరించే ధైర్యం అంతకన్నా లేదు. అయినా యిలాంటి కేసులు ఆమెకు మామూలే. అంచేత అలవాటుగా మధురమైన చిరునవ్వును మొహానికి పులుముకొని ప్రేమగా వనజ తల నిమిరింది. గౌను క్రింద గుండెల్ని తాకుతూవున్న "క్రాస్"ను తీసి కళ్ళ కద్దుకొంది.

"ప్రశాంతంగా వుండమ్మా. కలత చెందకు. నీ సమస్యను రక్షకుడైన ప్రభువు పాదాలచెంత వుంచి నిశ్చింతగా వుండు. ప్రభువు నీకు మేలు చేస్తాడు."

"ప్రభువు మేలు చేస్తాడు డాక్టర్. కాని ఎప్పుడు ? అంతవరకు ఆగితే నాకు బలవంతంగా యిష్టంలేని పెళ్ళి చేస్తారే ? ఒకరిని ప్రేమించి,

మరొకరిని పెళ్ళి చేసుకోవటం ప్రాతివత్యం కాదు. ప్రేమలేని వ్యక్తితో కాపురం చేయటం పిరికితనమే కాదు, వ్యభిచారం కన్నా పెద్ద నేరం కాదా డాక్టర్ ? మీరే చెప్పండి."

డాక్టర్ నైటిన్‌గేల్ శరీరాన్ని క్షణంలో నీరసం ఆవహించింది. మొహంలో నల్లని మబ్బుతెర పడింది. తలలో మత్తుగా అణగివున్న తేనె టీగలు వొక్కసారిగా ఝుమ్మని లేచాయి. నిలవలేనట్టు తన గదిలోకి వెళ్ళి పోయింది.

"ప్రభూ. ఆమె ప్రేమను సాఫల్యం చేయి" క్రీస్తు బొమ్మను వేడు కుంటూ ఏకాంతంలో హాయిగా ఏడ్చింది.

* * *

నైటిన్‌గేల్‌కు చిన్నతనంనుంచీ భగవత్ భక్తి జాస్తి. అన్నలు, అక్కలే ఆమె ధోరణిని పరిహసించేవారు. అయినా భగవంతుడి కృపలో అచంచల విశ్వాసం వుంచింది. క్రీస్తుని రక్షకుడుగా మనసా వాచా కర్మణ్యా నమ్మింది.

ఆమె తండ్రి దైవసహాయం ఆ వూళ్ళో చర్చికి ఫాదర్. మత ప్రచారకుడుగా ఆయనకు దేశంలోనేకాక విదేశాలలోనూ మంచి పేరుంది. అయితే నిజజీవితంలో ఆధ్యాత్మిక దృష్టి కన్నా ఆయనకు లౌకిక దృష్టే జాస్తి. బోలెడంత డబ్బు సంపాదించాడు. కొడుకులు, కూతుళ్లు పుట్టగానే వారి భవిష్యత్ జీవితాలను నిర్ణయంచేసి, అందుకు అవసరమైన భూమికలను నిర్మించటం ఆయన హాబీ. బిడ్డలందరి విషయంలోనూ ఆయన అంచనాలు, ఆలోచనలు ఖచ్చితంగా జరిగాయి. ఒక్క నైటిన్‌గేల్‌మాత్రం అడుగడుగున ఆయన్ని తికమకలు పెట్టింది.

కేథలిక్ మత పద్ధతులైన సప్త సంస్కారాలను, సత్కర్మలను అభిమానించేది. హిందూ ఉపనిషత్ గ్రంథాలను చదివేది.

"నేను వో మత గురువునమ్మా. మన మతానికి విరుద్ధమైన వాటిని నువ్వు అభిమానించటం, ఆచరించటం బాగుంటుందా ?"

"మంచి పద్ధతుల్ని అనుసరించటానికి మతాలు ప్రతి బంధనాలు అవుతాయా నాన్నగారూ ?"

అసలు దైవసహాయానికి నైటిన్‌గేల్ అన్న పేరు కూతురు పెట్టు కోటం నచ్చలేదు. ఆమె పేరు అసలు అది కాదు.

కాన్వెంటులో చదువుతున్న రోజుల్లో "దిలేడీ విత్ ఎ లేంప్" నాటకంలో ఫ్లారెన్స్‌నైటిన్‌గేల్ వేషం వేసిందామె. నర్సు వేషంలో ఆమె తాదాత్మ్యం చెంది నటించింది. ఆ నాటకం చూచినవారు ఆపేరు ఆమెకు రూఢి చేసేరు. ఆమె తను నైటిన్‌గేల్ అయినట్లే సంతోషించింది. పేరుతో పాటు ఫ్లారిన్స్‌నైటిన్‌గేల్‌కు సేవా దృక్పథం కూడా అలవడింది. డాక్టర్ కోర్సు చదివింది.

అప్పుడే ఆమె శరత్‌బాబును ఏదో సందర్భంలో చూసింది. మగ వారికి దూరంగా వుండే నైటిన్‌గేల్ అతని చేత అమితంగా ఆకర్షించ బడింది. అతని పరిచయాన్ని తనకుగా తాను కోరి పెంచుకుంది. అతని వంశ చరిత్ర తెల్సుకొంది.

అతను హిందువు. ఉన్నత కులంలో పుట్టాడు. అందం, తెలివి తేటలు వున్నాయి. వేద మంత్రాలను స్వరయుక్తంగా చదువుతాడు. హిందూ సంస్కృతిని గురించి అమోఘంగా వుపన్యసిస్తాడు. యిన్ని లక్షణాలున్న అతను బీదవాడు.

అతను తనను వివాహం చేసుకోటానికి అంగీకరిస్తాడో, అంగీకరించడో అని చాలా కాలం మథన పడింది. తమ వివాహం సాధ్యంకాదన్న భావనలో అతడినించి దృష్టి మరల్చే ప్రయత్నం కూడా చేసింది. కానీ సాధ్యమవుతేనా ? ఆకర్షణ... ప్రేమ....పిచ్చి .... ప్రభూ. ఏమిటి నాకీ పరీక్ష ? మూగఘోష ?

చివరికి యిక నిగ్రహించుకో లేకపోయింది. తన ప్రేమను తెలిపి వివాహం చేసుకోమని అర్థించింది.

"నైటిన్‌గేల్ ! నీ మాట నైటిన్‌గేల్ పక్షి పాటంత మధురం. నీ హృదయం నవనీత సమానం. నువ్వు ఎప్పుడూ ధరించే తెల్లని బట్టల కన్నా స్వచ్ఛమైనది నీ ప్రేమ. నీ ప్రేమను పొందగలిగిన నేను అదృష్ట వంతుడిని. నిన్ను ప్రేమించటానికి నాకు మతం, కులం యివేమీ అడ్డు రావు. వచ్చినా ఎదిరించగలను. కానీ డియర్ మన ప్రేమకు పెళ్ళికి ప్రతిబంధనం నీ వైపు నుంచి వస్తుందేమోనని నాభయం. నీది ధనమతం- నాది బీద మతం. నువ్వు ఈ నూతన మతాల వ్యత్యాసాన్ని గుర్తించక పోయినా మీ తండ్రి గుర్తిస్తాడు. ఎదిరించే ధైర్యం వుందానీకు ? ఆలో చించుకొని అడుగు వెయ్యటం మంచిదికాదూ ?"

శరత్‌బాబు వూహించినట్లే జరిగింది. కూతురు తన అభీష్టానికి వ్యతిరేకంగా ఎన్ని చేసినా సహించి, యింటి గుట్టును రచ్చ కీడ్చని దైవ సహాయం, కూతురు వో బీద హిందువును పెళ్ళి చేసుకోవాలనుకొంటున్న దని విని సహించలేక పోయాడు. జాగ్రత్తగా ఎన్నో ప్రతి బంధకాలు సృష్టించాడు. ఆమె ప్రేమను విఫలం చేసి తన ప్రణాళిక ప్రకారం డేవిడ్ కిచ్చి పెళ్ళి జరిపించాడు.

డేవిడ్ సిరిసంపదల్లో పుట్టినవాడు. ఉన్నత ప్రభుత్వోద్యోగి. భర్తతో కల్సి నైటిన్‌గేల్ యూరఫ్ అంతా పర్యటించింది. వెటికన్ సిటీలో పోప్‌ను దర్శించింది. అమెరికాలో గైనకాలజీలో ట్రెయినింగ్ పొందింది.

అయినా శరతుకు దూరం కాలేక పోతోందేం ? తిరిగి దేశానికి రాగానే అతడిని గురించి విచారణ చేసింది. అతడికి పెళ్ళయింది. ఏదో వుద్యోగంలో చేరేడు. అప్పటికీ అతడిని మర్చిపోలేక పోతోంది ?

సేవా దృక్పథంతో డాక్టర్ వృత్తిని స్వీకరించింది నైటిన్‌గేల్.

డేవిడ్‌కు యిష్టంలేదు. అయినా కాదనలేదు. యిద్దరు బిడ్డలకు తల్లి అయింది.

డాక్టరుగా గొప్ప పేరు సంపాదించింది. కష్టాలలో బాధలలో వున్న అభాగ్యులకెందరికో ఆమె వోదార్పుమాట పన్నీటి చిలకరింపు. ఆమె నవ్వు రోగులందరికీ వెన్నెల జల్లు. ఎందరికో ప్రాణదాత. తల్లి కడుపులోనే అడ్డం తిరిగిన ఎందరు బిడ్డలకి వెలుగుచూపిందో ?

హాస్పటల్లో రోగులసేవ, ఇంట్లో భర్త బిడ్డలసేవ. స్వసుఖం కన్న సేవలోనే ఆమె ఆనందాన్నిపొందుతుంది. ప్రభువును చూస్తుంది. ఆయనకు దగ్గర కావటానికి సేవ ఎంత గొప్ప మార్గం ? అయినా ఎప్పుడో సమయం చూచుకొని ఆమె మనసులో శరత్‌బాబు తళుక్కు మంటాడు. అతడిని ఎంత మర్చిపోదామన్న మర్చిపోలేక పోతున్నదేం ?

వనజ ఏమంది ? అసలామాటలు తన నుద్దేశ్యించే అనలేదుకదా ?

తాను భర్తతో కాపరం చేసింది. ఏనాడు అతనికి లోటు చేయలేదు. కానీ అతడిని మనఃస్ఫూర్తిగా ప్రేమించిందా ! భర్త సన్నిధిలో వుండగా శరత్‌బాబు ఎన్ని మార్లు గుర్తుకు రాలేదు? అయినా బిడ్డల్ని కన్నది. వనజ అన్నట్లు తను .. తను....

భావనా మాత్రంగానే ఆమె పంచాగ్ని మధ్యంలో వున్నట్లు బాధ పడింది. మనసు మలమలా మాడిపోతూంది.

"ప్రభూ నేను పాపిని. నన్ను రక్షించు "

* * *

"డాక్టర్ ! నా ప్రాణం పోయినా ఫర్వాలేదు. కానీ పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ మాత్రం చేయకండి. నేను తల్లిని కావాలి" పేషెంట్ నిశ్చయంగా అంది.

"ఆందోళన పడకమ్మా. నేనూ స్త్రీనే. మాతృత్వపు తీపి నాకు

తెలియదా ? మీ వారిని పిలిపించి మాట్లాడుతాగా ? ఇంజక్షన్ యిస్తూ తియ్యగా అంది నైటిన్‌గేల్.

"డాక్టర్ భర్త ప్రేమకు నోచుకోని అభాగ్యురాలిని. పిల్లల్ని కనే అర్హతను కూడా పోగొట్టుకుంటే యిక నా బ్రతుకు వృధాకదా ? అంత కన్నా నాకు మరణమే సుఖం. డాక్టర్...." ఇంజక్షన్ మత్తులోకి జారిపోతూ గొణిగింది పేషంటు.

భర్త ప్రేమకు, మాతృత్వానికి రెంటికీ నోచుకోని అభాగ్యురాలు పాపం !

ప్రేమ....ప్రేమ....శరత్‌బాబు హఠాత్తుగా మనసులోకి వచ్చాడు. నైటిన్‌గేల్ కలవరంచెందింది. అతడిని మర్చిపోయే ప్రయత్నంలో ఈ మధ్య సేవను ఎక్కువ చేసింది. ఆధ్యాత్మికపు ఆలోచనలని పెంచుకుంది.

ప్రేమ గొప్పదే. కానీ ప్రాణంకన్నా, సేవ కన్నా గొప్పదా ? క్రీస్తు ప్రభువు మానవ సేవకోసం కాదా శిలువ నెక్కింది ? ఆ కరుణా మూర్తి కన్నా ప్రేమమయుడెవరున్నారు ? ఆయన ప్రేమ అలౌలికమయి నది. విషయ వాంఛలకు అతీతమైనది. సర్వ మానవ ప్రేమ. తనూ అదే ధర్మాన్ని ఆచరిస్తుంది.

పేషెంట్ భర్త వచ్చినట్లు కబురు తెచ్చింది నర్సు. లోపలికి రావటానికి నైటిన్‌గేల్ అనుమతి నిచ్చింది.

స్ప్రింగ్ డోర్ తెరుచుకుంది.

"డాక్టర్................"

ఆ పిలుపుకే మనసుకి పులకరింతేమిటి ? రోజుకు అలా ఎంత మంది ఎన్ని సార్లు పిలవడంలేదు ? ఎన్నడూ లేని ఈ అనుభూతి ఎలా వచ్చింది ఆ పిలుపుకి ?

శరత్‌బాబు గడ్డం పెరిగింది. మొహంలో విషాదం గూడు కట్టు

కొని వుంది ? అయినా ఎంత ఆకర్షణ ? ఎన్నో ఏళ్ళ తర్వాత కలయిక. అతడిని చూచేకొద్దీ మనసు వివశత్వం చెందింది. తనని తాను క్షణం మర్చిపోయింది. లేచి అతడిని ఆహ్వానించి కుర్చీలో కూర్చోబెట్టింది. అతను అనాసక్తంగా వుండడం గమనించింది.

"యిన్నేళ్ళ తర్వాత కల్సుకొన్నాం మనం. నీకు ఆనందంగాలేదూ? ఏవేవో కబుర్లు చెప్దామని మనసు ఆరాటం చెందటంలేదూ ?"

"లేదు నైటిన్‌గేల్. నీకు వివాహ మయినరోజే నేను చని పోయాను."

నైటిన్‌గేల్ మనసు గర్వంతో పొంగింది. అనిర్వచనీయమైన గొప్ప అనుభూతి ! తనను అంత గాఢంగా ప్రేమించాడా అతను ?

"నా దురదృష్టానికి నేనెన్నడూ విచారించలేదు నైటిన్‌గేల్. నీ అదృష్టానికి ఆనందించాను. కానీ నా భార్య"

అపుడు గుర్తు కొచ్చిందామెకు-శరత్‌బాబు ఆ పేషెంట్ భర్త.

క్షణంలో ఆమె డాక్టరుగా మారింది. విషయాన్ని వివరించి చెప్పింది.

"ప్రేమకు దూరమయ్యాను. భార్య నన్ను అర్థం చేసుకొని సాను భూతిని చూపలేదు. కోరికలన్నింటినీ చంపుకో గలిగేను కానీ తండ్రి కావాలన్న కనీస కోరికను ఎంత ప్రయత్నించీ చంపుకోలేక పోతున్నాను నైటిన్‌గేల్. నువ్వు గొప్ప డాక్టరువి. నాకు పిల్లలు కావాలి. భార్యకూడా కావాలి. ఈ రెండూ నాకు లభ్యమయ్యేలా చేయలేవూ ?"

అతని కళ్ళల్లో దీనత్వం............ మాటల్లో నిర్వేదం....భరించ లేక పోతోంది నైటిన్‌గేల్. తండ్రి కావాలన్న చిన్నకోరిక, తీర్చలేదా తాను ? యిదేనా ప్రేమ ?

ఆమె అతడినే చూస్తోంది. ఆమె మనసు అర్థించసాగింది. అతని

కోరిక హృదయంలో మెల్లగా ప్రతిధ్వనిస్తున్నది. ఎంతతియ్యటి కోరిక ! ప్రేమ.... ప్రేమ వెల్లువుకుతోంది ఆమెలో. ప్రేమలోనుంచి జాలి!

అతడిని గుండెలకు హత్తుకుని "నేనున్నానని" అని వోదారిస్తే ఎంతహాయిగా వుంటుంది ? కానీ ఏం చేయగలదుతాను ?

అతని బాధకు కారణం ప్రేమ వైఫల్యం, పిల్లలు పుట్టకపోవటం. యీ రెండూ తను అతనికిస్తే ?

అతను కోరుకునే ప్రేమ తనదగ్గర తరగకుండా అలాగేవుంది. కాథలిక్ మత విశ్వాసంతో పిల్లల్నికనే అర్హత తను కోల్పోలేదు తాను.

భక్తులబాధల్ని వుపశమింపచేయడానికి క్రీస్తుప్రభువు ఎన్ని అద్భుతాలు చేశాడు ? ఎంత మహిమ ప్రదర్శించాడు. మరి తాను సామాన్యురాలు. అయినా తనవద్దవున్నదాన్ని అతనికిచ్చి బాధను వుపశమింపచేయడం సేవకాదా ?

సేవాభావంతో ఆమె ప్రేమమూర్తిగా పరివర్తనం చెందింది.

"శరత్ ప్రేమకోసం, పిల్లలకోసం బాధపడుతున్నావా ? నిన్ను ప్రేమించే నేనింకావున్నాను శరత్" అతని గడ్డాన్ని పట్టుకుని తలఎత్తి కళ్ళలోకి ప్రేమగాచూస్తూ, ఏ వికారంలేకుండా ప్రశాంతంగా అంది.

శరత్ కొయ్యబారిపోయాడు. అంతలోనే తెప్పరిల్లాడు. తననితాను నిగ్రహించుకున్నాడు. చివాలునలేచి బయటికి వెళ్ళిపోయాడు. అదేసమయంలో "మమ్మీ" అంటూ హఠాత్తుగా నైటిన్‌గేల్ కొడుకు లోపలికొచ్చాడు.

చిత్తభ్రమ-భ్రాంతిలో నుంచి బయటకొచ్చింది నైటిన్‌గేల్. కొడుకును కౌగిట్లోకి తీసుకుంది. "ప్రభూ" అంటూ అతడిని గట్టిగా కౌగలించుకుని ఏడ్చింది.

* * *

నైటింగేల్ తనకి తనే శిలువ వేసుకుంటున్నట్లు బాధ పడ్తోంది. ఆ శిలువభారాన్ని మోయటం ఎలా ?

ఎంత పాపపుఆలోచన వచ్చింది ? చిన్నతనంనుంచి తనలో పెరుగుతున్న మతవిశ్వాసాలు, సంస్కారాలు ఎక్కడికిపోయాయిఆక్షణం? శరత్ బాబు ఎంతటి ఉన్నతుడు ? అతను నిగ్రహించుకోకపోతే ఏమయ్యేది ?

"ప్రేమ గొప్పదే నైటింగేల్. కానీ ప్రేమ కోసం నైతిక ధర్మాలను విస్మరించటం సమాజానికి ఆరోగ్యం కాదుగదా ? నాగరికసమాజం అందుకేకదా. మతధర్మాలు సమాజధర్మాలనే వుచ్చుతో మనిషిని బంధించింది ? ఆ బంధాలను తెంచుకోటం సులభమే. కానీ కొత్తముడులు తయారుచేయడం కష్టంకదా ?" ఎంత బాగారాసేడు వుత్తరం ?

నైతికధర్మాన్ని విస్మరించి తను పాపకూపంలో పడింది. బయటికి వచ్చేదెలా ? పవిత్రురాలయేదెలా ? పాపపంకిలంలో కూరుకుపోతున్న తనను వుద్ధరించేవారెవ్వరు ?

డేవిడ్ ఆమెస్థితికి ఆందోళనచెందేడు. కాని రోగలక్షణం తెలిస్తే కదా చికిత్సచేసేది ? తన పాపపు ఆలోచనను భర్తకెలా చెప్పుకోగలదు ఆమె ?

"ప్రభూ, పాపులను వుద్ధరించటానికి వుదయించిన దివ్యజ్యోతివి నువ్వు. నా పాపానికి నిష్కృతిచూపవూ ?"

ఎన్నిసార్లు క్రీస్తుప్రభువు ముందు మోకరిల్లి దీనంగా వేడుకుందో? క్రాస్‌ను కళ్ళకద్దుకుందో ?

కాలం అన్నిబాధల్ని మరపించే మహౌషధం అని తను రోగులకి చెప్పేదే ! కానీ రోజులు గడిచేకొద్దీ తన బాధ పెరుగుతోందేకాని తరగదేం ? రోగులకేకాని పాపులకు యీ సూత్రం వర్తించదా ?

అరక్షణంపాటు వచ్చిన పాపపు ఆలోచన, యిప్పుడు విశ్వవ్యాప్త

మైనట్లు ఆమె మనసంతా ఆక్రమించింది. శరీరాన్ని దహిస్తోంది.

పాపానికి పరిహారం పశ్చాత్తాపమేనన్నాడు మార్టిన్‌లూథర్. పశ్చాత్తాపం పొందిన తనకు పాపపరిహార భావన కలగటంలేదు. శిలువభారం పెరుగుతోంది.

కాథలిక్ మతంలోని సప్తసంస్కారాలలో రెండోది గుర్తుకొచ్చిందామెకు.

"చెప్పుకోటానికి ఎవరూ లేకపోతే నీ సొద ఒకరాయితోనన్నా చెప్పుకో" అన్నాడో ఆంగ్లకవి. ఎంత అనుభవశాలో కదా ?

తనది సొదకాదు. పాపం. తన పాపపు ఆలోచన ఎవరికైనా చెప్పాలి. అప్పటికిగాని వుపశమనం వుండదు. శిలువబరువు తగ్గదు.

ఎవరితోనో ఎందుకు చెప్పుకోటం ?

కన్ఫెషన్ ! పాపకీర్తనం-ప్రభువుముందే పవిత్ర ఆలయంలో చేస్తుంది తను !

*　　*　　*

రోమన్ కాథలిక్ చర్చి ప్రాంగణంలోకి ప్రవేశిస్తుండే నైటింగేల్‌కు శిలువభారం తగ్గిపోతున్న భావం కలిగింది. మనిషి పాపంచేయటం సహజం. అందుకు బాధపడుట సహజమే. కానీ ఆబాధ అసహజంగా మారి మనిషిని దహించివేయకూడదు. అందుకే "పాపసంకీర్తనం !"

ఆమె లోపలికి ప్రవేశించింది. ప్రశాంతత-పవిత్రత ! అల్లంత దూరంలో కులగురువుఆసీనుడయ్యే కన్ఫెషనల్ కన్పిస్తోంది. దానిప్రక్కనే మోకరించి తను కూర్చోవాలి. ఫాదర్‌చెవిలో తన పాపపు ఆలోచనను చెప్పుకుంటుంది. గురువు ఆలకిస్తాడు. ప్రభువుకు నివేదిస్తాడు. ప్రాయశ్చిత్తాన్ని విధిస్తాడు. తను యిన్నాళ్ళుగా మోసిన శిలువ పాపభారాన్ని కోల్పోతుంది. పవిత్రమవుతుంది.

మెత్తటి అడుగులసవ్వడి. ఆ నడకలో ఎంత ప్రశాంతత ? పాప

భారంతో వాలిపోయిన తలనెత్తి అపూర్వమూర్తిని సందర్శించే ధైర్యం చేయలేకపోయిందామె. మెల్లగా "కన్ఫెషనల్" వద్దకు నడిచింది.

"నైటిన్‌గేల్ నువ్వా ! ఏం పాపం చేశావు ? కన్ఫెషన్ చేసేటంత పెద్దపాపాన్ని చేసేవా ?"

ఆమె ఊహించిన ప్రశాంతత, దైవత్వం ఫాదర్ గొంతులో ఆమెకు విన్పించలేదు. సామాన్యుడు లౌకిక దృష్టితో ప్రశ్నించినట్లుంది. తండ్రి గుర్తుకొచ్చాడు !

తలెత్తి ఫాదర్‌వంక చూచింది. దుస్తులు తెల్లగా, పరిశుభ్రంగా వున్నాయి. కానీ ఆయన వచనంలో పాపపు జీరలు తెరలు తెరలుగా కన్పిస్తున్నాయ్ !

ఆయన ఆమెతండ్రి స్నేహితుడు. తన తండ్రిలో ఎంత దైవత్వముందో అంతకన్నా ఎక్కువ ఆయనలో లేదు. ఆయనను గురించి ఎన్నెన్నికథలు విందో ? అలాంటి వ్యక్తిముందా, తనకు క్షణకాలంపాటు వచ్చిన పాపపు ఆలోచనను చెప్పుకోవాల్సింది ? రాయి రువ్వటానికేకాదు- కన్ఫెషన్ చెయ్యటానికూడా పవిత్రతే అర్హత !

సో-పాపం చెయ్యకపోవటంకాదు పాపపు ఆలోచనేరాని వ్యక్తి ముందు మాత్రమే తను "కన్ఫెషన్" చేస్తుంది. ప్రాయశ్చిత్తాన్ని పొందుతుంది.

నిశ్శబ్దంగా చర్చి బయటికి నడిచింది.

పాపపు ఆలోచనేరాని గురువులు ! ఎక్కడ లభిస్తారు ? ఎంత అన్వేషించి ఏం లాభం ? ఎన్నిపూళ్ళు తిరిగిందామె ? ఏగురువు మొహం చూచినా ప్రశాంతత వెనుక ఎన్నెన్ని రహస్యపు పాపపుమరకలు ? నటన- చర్చిలో, దైవసన్నిధిలో-నటన !

"ప్రభూ పాపంచేయనివారు, పాపపు ఆలోచనేరానివారు లేనేలేరా

యీ భూమిలో ? లేక నా కంటిదోషంవల్ల అందరూ నాకు పాపులుగా కన్పిస్తున్నారా ? నీ బోధనలచాటున, నీ రక్షణలో అందరూ పాపాలేచేస్తు న్నారుదేవా. యిందరు పాపుల్ని ఎలా వుద్ధరిస్తావుప్రభూ.

ఆమె విశ్వాసాలు సన్నగిల్లటం ప్రారంభించాయి. మతపుతెరల్ని తెంచుకోంటోంది.

అకస్మాత్తుగా ఆమెకు శరత్‌బాబు గుర్తుకొచ్చాడు? ఆమె చెప్పిం దంతా విని శరత్ ఫిలసాఫిక్‌గా నవ్వాడు.

అంతఃకరణ అనేది ఉంటే, మానవుడికి మొదటి మిత్రువు, శత్రువు కూడా అదే. పాపాలు చేయదల్చుకున్నవారు దాన్ని ముందు చంపుకోక తప్పదు. తప్పులు చేసేవారంతా "కన్‌ఫెషన్"లు చేయటం మొదలుపెడ్తే లోకం తలక్రిందులవుతుంది. అంతర్యుద్ధాలు, అరాచకాలు, హత్యలు పెరిగిపోతాయి. వివేకంలేని విశ్వాసం వినాశనకరమేకదా ?

"కన్‌ఫెషన్" ద్వారా భగవంతుడు పాపాలని క్షమించేస్తాడన్న విశ్వాసంకన్నా, క్షమించడన్న భయమే మానవుడిని మంచిమార్గంలో నడి పిస్తుందేమో ! నీ అంతఃకరణ పరిశుభ్రంగానే వుంది. పాపసంకీర్తనలు, పశ్చాత్తాపాలు, ప్రక్షాళనలు అనవసరం. ఒకవేళ యింకా అది అవసరమని నువ్వు భావిస్తే-నీ కన్‌ఫెషన్‌విని, నిన్ను క్షమించాల్సిన గురువు భర్త. నీ భర్తలో భగవంతుడి లక్షణాలు వున్నాయన్న విశ్వాసం నీకు వుందా ?"

నైటింగేల్‌కు అంతా మంచివారుగానే కన్పిస్తారు.

"మీకు నన్నుగురించిన రహస్యం వొకటి చెప్పాలనుకుంటున్నా. విని క్షమిస్తారా ?"

పెళ్ళికిపూర్వం భార్య ప్రేమకథ డేవిడ్‌కు చూచాయగా తెల్సు. ఆమె ధోరణి అతనికీ అనుమానంగానే వుంది. కొంపతీసి కాలుజారలేదు కదా ?

నైటింగేల్ భర్త మొహంలోకే చూస్తోంది. పెద్దపెద్ద మరకలు-నల్లటి పాపపుగురుతులు! క్రీస్తుకు శిలువవేసిన మానవులవారసులు!

తనకూ శిలువ వేస్తారు. మేకులు దిగగొడ్తారు. సంకుచితులముందు సహృదయత ఏం రాణిస్తుంది?

"ఏంలేదు, నేను మీ అభీష్టప్రకారం ప్రాక్టీసు మానేయాలనుకుంటున్నాను. భర్తకన్నా భగవంతుడెక్కడున్నాడు? మీ సేవకన్నా మించిన సేవ ఏముంది?

డేవిడ్ సంతోషంతో పొంగిపోయాడు. ఆమెను పొగిడేడు. ప్రేమ కూడా నటనే!

మానవుడు-తొలిమానవుడు - అల్పమానవుడు-సైతాన్ అంశలున్న సాధారణ మానవుడు!

"ప్రభూ. నువ్వంటూవుండి-నీ దగ్గరికి నేను చేరగలిగితే నా పాపాలనేకాదు ప్రపంచంలో ఎందరి పాపాలనో నీ చెవిలో బిగ్గరగా కన్ఫెషన్ చేస్తాను. ప్రభూ నిర్మలత్వం, నిజాయితీ, పవిత్రత లేని అల్పమానవులకు నటనే జీవితమార్గం.

నీకానాడు ఎవరో శిలువవేశారు. మేకు దిగగొడుంటే నవ్వుతూ భరించావు. కానీ ప్రభూ యీనాడు ఎవరి శిలువలను వారే వేసుకుంటున్నారు. నవ్వుతూనే యితరుల గుండెల్లో మేకులు దిగగొడ్తున్నారు. పవిత్ర చిహ్నంగా శిలువ ధరిస్తూ, పాపాన్ని పంచిపెడ్తున్నారు.

లోకపు యీ శిలువభారాన్ని ఎప్పుడు దించుతావు ప్రభూ?

డేవిడ్ ప్రేమకౌగిట్లో నైటింగేల్ నలిగిపోతోంది. కాని పాపపు కౌగిల్లోవున్న ఆమె అంతరాత్మ ఆక్రోశిస్తూ మొరలుపెట్టుకుంటోంది!

(ఆదివారం వారపత్రిక 5-7-81)